

టమాట కిలో రూ. 56

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.56 పలికింది. కనిష్టం 36. సరాసరి 44 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రాష్ట్ర స్థాయి అండర్–13 చెస్‌పోటీలకు అనంతపురానికి చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.4°/22.8°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. పలు చోట్ల తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6–8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జనావాసాల్లోకి పునుగు పిల్లి



పునుగు పిల్లి

రాయదుర్గంటౌన్: అరుదైన వన్యప్రాణి జాతికి చెందిన పునుగు పిల్లి జనావాసాల మధ్య కనిపించింది. పట్టణంలోని 18వ వార్డు తేరుబజారు వెనుక మేదర కాలనీలోని పాల నాయక్ అనే వ్యక్తి ఇంట్లోకి శనివారం పునుగు పిల్లి వచ్చింది. ఆయన దాన్ని చిన్న బోనులో బంధించారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో పునుగుపిల్లిని పైతోట సమీపంలో అటవీ ప్రాంతంలో వదిలేశారు.

పండుగ పూట రెచ్చిపోయిన చైన్‌స్నాచర్లు

అనంతపురం: పండుగ పూట నగరంలో చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. స్థానిక కోవూరు నగర్ 5వ క్రాస్‌లో ఆదివారం ఉదయం దుండగులు ఓ మహిళ మెడలో చైన్ దొంగిలించుకెళ్లారు. గతంలో ఇన్‌చార్జ్ డీఈఓగా పనిచేసిన రంగస్వామి భార్య లక్ష్మీదేవి వాకింగ్‌కి వెళ్లి వస్తుండగా వెనుక వైపు నుంచి బైక్‌లో వచ్చిన ఇద్దరు దుండగులు 2.5 తులాల బంగారు చైను లాక్కెళ్లిపోయారు. నలుపు రంగు దుస్తులు ధరించి, ఇద్దరూ హెల్మెట్ పెట్టుకుని ఘటనకు పాల్పడ్డారు. ఈ విషయం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. దీనిపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చైన్ సుమారు రూ. 2 లక్షల విలువ చేస్తుందని బాధితురాలు పేర్కొన్నారు.

• అలాగే, శనివారం అనంతపురం సాయి నగర్ 4వ క్రాస్‌లో కనకదుర్గమ్మ గుడి వద్ద ముగ్గులు వేస్తున్న ఓ మహిళ మెడలో దుండగులు చైన్ లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. చైన్ తెగక పోవడంతో రోడ్డుపై పడి మహిళకు గాయాలు అయ్యాయి. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి బైక్‌పై పరారయ్యారు. దీంతో పాటు పక్కవీధిలో మరో మహిళ మెడలో చైన్ లాగడానికి ప్రయత్నించి దుండగులు విఫలమయ్యారు.

గోవిందా.. గోవింద



చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

తాడిపత్రి అర్బన్: చింతల వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం స్వామి సూర్య, చంద్రప్రభ వాహనాలపై విహరించారు. సూర్యప్రభ వాహనంపై దేవదేవుడి దర్శనం పూర్వ ఫలాన్ని ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే స్వామి సేవకు పోటెత్తి గోవిందా.. గోవింద నామస్మరణలో మార్మోగించారు. రాత్రి చింతల రాయుడు చంద్రప్రభ వాహనంపై ఊరేగగా.. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. సూర్యుడు దివాకరుడు, చంద్రుడు నిశాకారుడు. సూర్యకాంతితోనే చంద్రుడు ప్రకాశిస్తాడు. కనుగ పగలు సూర్యప్రభ వాహనం జరిగిన తరువాత రాత్రి చంద్రప్రభ వాహన సేవ వైభవంగా నిర్వహించారు.

టీబీ డ్యాంకు భారీగా వరద



తుంగభద్ర జలాశయం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్/రాయదుర్గం: కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తింది. దీంతో డ్యాం 20 క్రస్ట్ గేట్లు 2.5 అడుగుల మేర ఎత్తి 73,260 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆదివారం సాయంత్రానికి 88,588 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 1,633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 1631.97 అడుగుల వద్ద 101.656 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. జలాశయం ఎగువన ఉన్న ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో డ్యాంకు వరద నీరు పోటెత్తుతోంది. అక్టోబర్‌లో కూడా ఇన్‌ఫ్లో భారీగా నమోదవుతూ డ్యాం కళకళలాడుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబరం.. దసరా సంబరం



అనంతపురంలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



గుంతకల్లు: సీతారామలక్ష్మణుల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

దసరా వేడుకలు జిల్లాలో అంబరాన్నంటాయి. అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులతో ఆలయాలు శనివారం కిటకిటలాడాయి. దేవుని వద్ద కొత్త బట్టలను ఉంచి పూజలు చేసిన అనంతరం వాటిని ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. యువతీయువకులు జమ్మిచెట్టుకు పూజలు చేసి, జమ్మి ఆకు పెద్దలకు అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. – సాక్షి బృందం

పురివిప్పిన జలజగడం

- నార్పల మండల పరిధిలో మిడ్‌పెన్నార్ సౌత్ కెనాల్ నీటి కోసం కురగానపల్లి, నడిమిదొడ్డి, వెంకటాంపల్లి గ్రామాల రైతుల మధ్య శనివారం రాత్రి ఘర్షణ తలెత్తింది. 28వ తూము వద్ద పెద్ద ఎత్తున వాగ్వాదానికి దిగారు. తాగడానికి నీళ్లు లేవంటూ పలు గ్రామాల రైతులు, పంటలు ఎండుతున్నాయని మరికొంతమంది రైతులు గొడవకు దిగారు. చేతుల్లో కర్రలు, రాళ్లు ఉండడంతో పరిస్థితి ఉద్రికంగా మారింది. ఈ క్రమంలో గ్రామస్తులంతా భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు సర్ది చెప్పి పంపారు.

.... ఇదొక్కటే కాదు.. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఊళ్లకు ఊళ్లకు మధ్య జగడాలు పురివిప్పుకుంటున్నాయి. ఇలాంటి వివాదాలు ఈ సారి ఆయకట్టు కింద చాలా చూడాల్సి వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- రైతుల నడుమ మొదలైన నీటి యుద్ధాలు
- నార్పల మండల పరిధిలో గొడవకు దిగిన అన్నదాతలు
- అధికారుల నిర్లక్ష్యంతోనే దుస్థితి
- చివరి ఆయకట్టుకు నీటిని తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధులూ విఫలం



మిడ్‌పెన్నార్ సౌత్‌కెనాల్ 28వ తూము వద్ద గుమిగూడిన రైతులు

అనంతపురం సెంట్రల్: ఆయకట్టు కింద పంటలు సాగు చేసుకుందామనుకున్న రైతుల ఆశలు పాలకుల నిర్లక్ష్యం కారణంగా అడియాసలు అవుతున్నాయి. ముఖ్యంగా తుంగభద్ర ఎగువకాలువ (హెచ్చెల్సీ) కింద చివరనున్న మిడ్ పెన్నార్ సౌత్, నార్త్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. హెచ్చెల్సీ కింద ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నా ఆశించిన స్థాయిలో పంటలు సాగయ్యే పరిస్థితి కనిపించడం లేదు. లక్ష ఎకరాలకు సాగునీరివ్వాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 40 వేల ఎకరాలు కూడా దాటలేదని తెలుస్తోంది. అన్ని ప్రాంతాలకు సమంగా నీటిని పంపిణీ చేయడంలో అటు పాలకులు, ఇటు అధికారులు విఫలమవుతున్నారు. దీంతో త్వరలో నియోజకవర్గాల మధ్య కూడా జలజగడాలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఎగువనే వాడేసుకుంటున్నారు..!

ప్రస్తుతం తుంగభద్ర జలాశయం 101.656 టీఎంసీలతో నిండుకుండలా ఉంది. జిల్లా సరిహద్దులో హెచ్చెల్సీకి 1,840 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే ఎక్కువ శాతం నీరు ఎగువనే వాడేస్తుండటంతో దిగువన ఉన్న రైతులకు సరిగా అందడం లేదు. హెచ్చెల్సీ సౌత్, నార్త్, తాడిపత్రి తదితర ఉపకాల్వలకు నీరు విడుదల కావాలంటే పీఏబీఆర్, మిడ్‌పెన్నార్ రిజర్వాయర్‌లే కీలకం. వీటిలో నీరు పుష్కలంగా ఉంటే అన్ని ప్రాంతాలకు సమంగా పంపిణీ జరుగుతుంది. కానీ ఈ సారి రిజర్వాయర్‌లలో తగినంత నీరు నిల్వ లేకుండానే నీటి పంపిణీని ప్రారంభించారు. పైగా ఇన్‌ఫ్లో కూడా అనుకున్న స్థాయిలో రావడం లేదు. దీంతో సరిపడా నీరు అందక రైతులు ఘర్షణలకు దిగుతున్నారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 2.432 టీఎంసీలు, మిడ్ పెన్నార్ రిజర్వాయర్‌లో 1.622 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇంకా మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్, తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్‌తో పాటు పలు రిజర్వాయర్లు, లోకలైజేషన్ చెరువులకు నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఆరంభంలోనే నీటి యుద్ధాలు మొదలైతే రానున్న రోజుల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులు ఇప్పటి నుంచే దూరదృష్టితో ఆలోచన చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం



సీబీఆర్‌కు నీటిని విడుదల చేస్తే మా ప్రాంతంలో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. కునుకుంట్ల, చిన్నకొండయ్యపల్లి, రామాపురం, ముచ్చుకుంటపల్లి తదితర గ్రామాల్లో 15 వేల ఎకరాలకు పైగా చీనీ, అరటి, ఇతరత్రా పండ్లతోటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఇంతవరకూ చెప్పుకునే స్థాయిలో ఒక్క వర్షం కూడా కురవలేదు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. లక్షల చీనీ చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. ఈ ప్రాంత రైతులకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం కనిపించడం లేదు. పాలకులు ఓ సారి మా ప్రాంతానికి వచ్చి చూస్తే రైతుల పరిస్థితి అర్థమవుతుంది.

– వి. కుళ్లాయిరెడ్డి, రైతు కునుకుంట్ల గ్రామం, తాడిమర్రి మండలం

సంయమనం పాటించాలి



నార్పల మండలంలో రైతుల మధ్య జరిగిన ఘర్షణ విషయం మా దృష్టికి వచ్చింది. వీలైనంత ఎక్కువ నీటిని దిగువకు విడుదల చేస్తున్నాం. అయినా రైతులు ఘర్షణకు దిగారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. నీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. పొదుపుగా వాడుకుంటూ సంయమనంతో ఉండాలి. అనుకున్న సమయానికి అన్ని ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తాం.

– ఎస్. రాజశేఖర్, ఎస్ఈ, హెచ్చెల్సీ

మోగిన నీటి సంఘాల ఎన్నికల నగారా

అనంతపురం సెంట్రల్: ఆయకట్టు డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలో కీలకమైన నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 16 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. నవంబర్ 24లోగా ఈ తంతు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో త్వరలో చెరువులు, హెచ్చెల్సీ ఆయకట్టు కింద ఎన్నికల కోలాహలం ప్రారంభం కానుంది. కాలువల కింద రైతులు పంటలు సాగు చేసుకునే క్రమంలో ఇటు రైతులకు.. అటు అధికారులకు అనుసంధానంగా సాగునీటి సంఘాలు క్రియాశీలకంగా పనిచేస్తాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీటి విడుదలకు ఈ కమిటీలు దోహదం చేస్తాయి. రెండేళ్లకోసారి జరిగే ఈ ఎన్నికలపై ప్రభుత్వాలు పెద్దగా దృష్టి సారించడం లేదు. ఫలితంగా ఎన్నికలు కూడా ఆలస్యంగా జరుగుతున్నాయి.

మూడు జిల్లాల రైతులు..

హెచ్చెల్సీ కింద 99 నీటి సంఘాలు ఉన్నాయి. వీటితో పాటు చిన్ననీటి పారుదలశాఖలో మధ్య తరహా ప్రాజెక్టులు, పలు చెరువుల కింద నీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాతో పాటు వైఎస్సార్, కర్నూలు జిల్లాల ఆయకట్టు రైతులు ఎన్నికల్లో పాల్గొననున్నారు. దీనిపై హెచ్చెల్సీ ఎస్ఈ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. అంతా సవ్యంగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు.

హెచ్చెల్సీ కింద నీటి సంఘాల వివరాలు..

డిస్ట్రిబ్యూటరీలు	నీటి సంఘాల సంఖ్య	ఆయకట్టు (ఎకరాల్లో)
హెచ్ఎల్ఎంసీ	11	35,541
ఎంపీనార్త్ కెనాల్	5	13,325
ఎంపీ సౌత్‌కెనాల్	10	29,577
తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్	9	25,478
గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్	9	32,072
ఆలూరు బ్రాంచ్‌కెనాల్	6	14,255
జమ్మలమడుగు	10	22,625
ప్రొద్దుటూరు	10	24,524
యర్రగుంట్ల	9	23,392
కసనూరు (పులివెందుల కెనాల్)	5	8,843
సింహాద్రిపురం (పులివెందుల కెనాల్)	8	24,670
ఆచవలి (పులివెందుల కెనాల్)	5	16,507

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ ఉందా?

- ఆడబిడ్డలకు రక్షకుడిగా నిలబడతానన్న పవన్ మొహం ఎక్కడ పెట్టుకుంటారు?
- ఎమ్మెల్సీ, మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: చిత్తూరు జిల్లాలో బాలిక హత్యను మరవక ముందే చిలమత్తూరు మండలంలో ఇద్దరు మహిళలపై వారి భర్తల ముందే అఘాయిత్యానికి పాల్పడ్డారని,ఇదంతా చూస్తుంటే రాష్ట్రంలో మహిళలకు భద్రత ఉందా అనే సందేహం కలుగుతోందని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో ఇద్దరు మహిళలపై గ్యాంగ్ రేప్ ఘటన అత్యంత అమానుషం, దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విజయదశమి జరుపుకుంటున్న రోజే ఆదిపరాశక్తిగా కొలుచుకునే మహిళలపై అఘాయిత్యం జరగడం కలచివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే మహిళలపై రికార్డు స్థాయిలో అఘాయిత్యాలు పెరిగిపోవడం దారుణమన్నారు. ఈ ఘటనపై పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ ఇప్పటి వరకూ నిందితులను పట్టుకోకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆయన దుయ్యబట్టారు.

మహిళలకు మొహం చూపించగలవా పవన్?

తాము అధికారంలోకి వస్తే మహిళలపై దాడులు, అత్యాచారాలు అరికడతామని చెప్పిన పవన్‌కల్యాణ్ నేడు ఎక్కడ ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. 'మీ ప్రభుత్వ వంద రోజుల పాలనలో మహిళలపైనే అత్యధికంగా దారుణాలు చోటుచేసుకున్న విషయం మీకు తెలియదా? రాష్ట్ర మహిళలకు మీ మొహం చూపించగలరా' అంటూ విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం పిఠాపురంలోనే దళిత బాలికపై దారుణంగా అత్యాచారం జరిగిందని, కనీసం ఇదైనా పవన్‌కు తెలుసా అంటూ ప్రశ్నించారు. ఆయా ఘటనలపై మహిళా కమిషన్ స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలి



అనంతవెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

అనంతపురం కార్పొరేషన్: చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో జరిగిన సామూహిక అత్యాచార ఘటన అత్యంత బాధాకరమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పొట్టకూటి కోసం వచ్చిన అత్తా కోడళ్లపై గ్యాంగ్‌రేప్‌కు పాల్పడటం దుర్మార్గమన్నారు. నిందితులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హిందూపురం పారిశ్రామిక వాడల్లో సరైన భద్రత చర్యలు లేకపోవడం వల్లే ఈ దారుణం చోటు చేసుకుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పారిశ్రామిక వాడల్లో భద్రత లేదు



తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

రాప్తాడురూరల్: హిందూపురం పరిసర పారిశ్రామిక వాడల్లో కార్మికులకు భద్రత లేదని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లబొమ్మనపల్లిలో అత్త, కోడలిపై సామూహిక అత్యాచార ఘటనపై ఆయన స్పందించారు. పారిశ్రామిక వాడల్లో ప్రభుత్వం భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అలసత్వం వీడాలని హితవు పలికారు.

అత్యంత బాధాకరం



తలారి రంగయ్య, మాజీ ఎంపీ

కళ్యాణదుర్గం: చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో జరిగిన సామూహిక అత్యాచార ఘటన అత్యంత బాధాకరమని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య అన్నారు. పొట్టకూటి కోసం వచ్చిన అత్తా కోడళ్లపై గ్యాంగ్‌రేప్‌కు పాల్పడిన ఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిగ్గుచేటు



వి.రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి

అనంతపురం అర్బన్: కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన దారుణం మరువక ముందే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. మహిళలపై ఇంత ధైర్యంగా అత్యాచారాలకు పాల్పడుతున్నారంటే కఠిన శిక్షలు పడవనే ధీమా ఒక కారణమైతే... రాజకీయ నాయకులు అండ ఉంటారనే ధైర్యం మరో కారణమన్నారు. వీటికి మూలం ప్రపంచీకరణ విధానాల్లో ఉందన్నారు.

బాధితులకు అండగా నిలవాలి



సావిత్రి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి

అనంతపురం అర్బన్: అత్త, కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. సంఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం కాకుండా మూల కారణాలను తెలుసుకుని నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మూడు రోజులు భారీ వర్షాలు!

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సోమవారం నుంచి మూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షాల ప్రభావానికి గురయ్యే ప్రదేశాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి విపత్తు సంభవించినా ఎదుర్కొనేందుకు, సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వరద నీరు సాఫీగా వెళ్లేందుకు వీలుగా పట్టణాలు, గ్రామాల్లో కాలువలను శుభ్రం చేయించాలని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు సూచించారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు నీటి ప్రవాహానికి అడ్డుపడకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. వర్షా లకు పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రిజర్వాయర్లు, కాలువల్లో నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

రైతులూ జాగ్రత్త..

అనంతపురం అగ్రికల్చర్: అల్పపీడన ప్రభావంతో రాగల నాలుగు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశముండటంతో పంట తొలగింపు వాయిదా వేసుకోవాలని సూచించారు. తొలగించిన పంటలను టార్పాలిన్లతో కప్పి ఉంచాలన్నారు. ఉద్యానపంటల రైతులు పంట రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెల కాపరులు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

క్లుప్తంగా

పారదర్శకంగా మద్యం టెండర్ల ప్రక్రియ : జేసీ



జేఎన్‌టీయూ ఆడిటోరియాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం: మద్యం టెండర్ల లాటరీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తెలిపారు. మద్యం టెండర్లకు సంబంధించి జేఎన్‌టీయూ ఆడిటోరియంలో చేసిన ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించి, మాట్లాడారు. జిల్లాలో 136 మద్యం షాపులకు సంబంధించి మద్యం టెండర్లకు జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఓపెన్ లాటరీ ప్రక్రియ ద్వారా ఖరారు చేయనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు లాటరీ ప్రక్రియ మొదలవుతుందని, ఇందుకోసం రెండు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తుదారుడికి ఎంట్రీ పాసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఓపెన్ లాటరీ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం లాటరీ ప్రక్రియకు భారీ బందోబస్తు

మద్యం దుకాణాల నిర్వహణకు సంబంధించి టెండర్ల ఖరారు చేయనున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఉదయం 7 గంటలకు ఓపెన్ లాటరీ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసిన వారంతా రానున్న నేపథ్యంలో జేఎన్‌టీయూ పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నలుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలు, 280 మంది పోలీసు సిబ్బందిని పర్యవేక్షణకు నియమించినట్లు వివరించారు. అలాగే జేఎన్‌టీయూ ఆడిటోరియానికి చేరుకునే మార్గంలో మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

అనంతపురం: రాష్ట్ర స్థాయి అండర్ 13 విభాగం చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ముగిసింది. ఓపెన్ విభాగంలో సామ్యూల్ స్టీఫెన్ నోబుల్ ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, ద్వితీయ స్థానంలో జొన్నలగడ్డల నితీష్ చౌదరి, బాలికల్లో ప్రథమ స్థానాన్ని వై.లాలిత్య, ద్వితీయ స్థానాన్ని త్రిపద దక్కించుకున్నారు. వీరు నవంబర్ 1, 3 తేదీల్లో తాడేపల్లి గూడెంలో జరిగే ఏపీ అండర్-13 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఎ.ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు.

కొడితే మెరుపు.. విసిరితే మలుపు



ఇతని పేరు ఎస్ఎస్ వినీల్ కుమార్. స్వస్థలం ధర్మవరం. కుటుంబపోషణకు తల్లిదండ్రులు శ్రీనివాసులు, పద్మావతి చిన్న కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. రూ.లక్షలు చెల్లించి క్రికెట్ అకాడమీలో చేర్పలేని పరిస్థితి వారిది. అయితే క్రికెట్‌లో మెరుగైన ఆట తీరును కనబరుస్తున్న వినీల్‌కుమార్‌కు ఆర్డీటీ అకాడమీ దన్నుగా నిలిచింది. 2011 నుంచి 2017 వరకు ఆర్డీటీ అకాడమీలో శిక్షణ తీసుకున్న వినీల్... కుడిచేతి మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా, కుడి చేతి స్పిన్నర్‌గా రాష్ట్ర స్థాయిలో 35 క్రికెట్ మ్యాచ్‌ల్లో మెరుగైన ఆటతీరును ప్రదర్శించారు. ఫలితంగా బెంగళూరులోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో ఆయనకు ఉద్యోగం దక్కింది. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలు వెదుక్కొంటూ వస్తాయనేందుకు వినీల్‌కుమార్ జీవితమే ఉదాహరణ.



క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్న బాలిక

- మదిని దోచేసిన క్రికెట్
- పిల్లలను క్రికెటర్లుగా చూడాలని తల్లిదండ్రుల ఆశ
- పట్టణాల్లోనూ ఏర్పాటవుతున్న అకాడమీలు
- చదువుతో పాటు శిక్షణకూ ప్రత్యేక సమయం
- అందుబాటులో అత్యాధునిక సౌకర్యాలు
- రాణిస్తే తలుపు తట్టనున్న ప్రభుత్వ కొలువులు
- అంతకు మంచి వేలాదిగా అభిమానులు సొంతం



శిక్షణ పొందుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

అనంతపురం: క్రికెట్ అంటే చాలు.. అన్నం, నీళ్లు కూడా లేకుండా టీవీల ముందు వాలిపోతారు. ఆటగాళ్లను హీరోలుగా ఆరాధించే అభిమానులూ కోకొల్లలు. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన క్రికెటర్లు రిటైర్ అవుతుండగా తమ వంతు సత్తా చాటుతూ మరికొందరు క్రీజులో వచ్చి నిల్చొంటున్నారు. ఆటలోనూ అప్పటికి.. ఇప్పటికి ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తమ ఇంట్లోనూ ఓ క్రికెటర్ ఉండాలనే భావన తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది.

ఐపీఎల్ రాకతో మరింత చేరువ..

ఐపీఎల్ రాకతో క్రికెట్ క్రీడ గ్రామీణ ప్రాంతాలకూ చేరువైంది. 20 సంవత్సరాల క్రితం ఆటతో పోల్చుకుంటే ఇప్పుడు భారతీయ క్రికెట్‌లో వందలాదిగా క్రీడాకారులు మేమున్నామంటే మేమున్నామంటూ తెరపైకి వస్తున్నారు. బ్యాట్‌తో పరుగుల వరద పారిస్తూ .. బౌలింగ్‌తో బంతితో విన్యాసాలు చేస్తూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. పురుషులే కాదు.. మహిళలు కూడా తాము ఎందులోనూ తీసిపోమని చాటుతూ క్రికెట్‌లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తల్లిదండ్రులు సైతం పిల్లలను క్రికెట్ వైపు ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుండడంతో స్థానికంగా క్రికెట్ అకాడమీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

జిల్లాకు మరో క్రికెట్ అకాడమీ..

విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచనాధోరణి ఇప్పుడిప్పుడే మారుతోంది. క్రీడా ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తున్న క్రికెట్‌లో తమ పిల్లలూ గుర్తింపు తెచ్చుకోవాలని కోరుకుంటున్నారు. చదువుకు ప్రాధాన్యతనిస్తూనే క్రికెట్‌లో శిక్షణ ఇప్పించేలా ప్రణాళికను రూపొందించుకుని ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏటా వందలాది మంది శిక్షణ పొందుతున్నారు. త్వరలో అనంతపురం జిల్లాలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ స్టేడియంలో మరో క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో రెసిడెన్షియల్ శిక్షణతో పాటు నాణ్యమైన విద్యనూ అందించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ప్రతిభావంతులైన ఔత్సాహిక క్రీడాకారులకు అవకాశం దక్కనుంది.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు..

తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంత సేపు మార్కుల వెంట పరుగులు పెట్టిస్తూ మానసికంగా ఒత్తిడి పెంచుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అలాంటి పరిస్థితి లేకపోయినా కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులు నాలుగు గోడలకే పరిమితం అవుతుండడంతో పుస్తకాల పురుగులుగానే మిగిలిపోతున్నారు. చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే ధోరణి ఇందుకు కారణమవుతోంది. అయితే క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలు వస్తాయనేందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఇందులో భాగంగానే క్రికెట్‌లో రాణించి ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. రాష్ట్ర స్థాయిలో టాప్-10 ప్లేయర్లు, వర్సిటీ స్థాయిలో క్రికెట్ ఆడితే స్పోర్ట్స్ కోటా వర్తిస్తుంది. ఇక రంజీ ఆడితే ఉద్యోగం గ్యారెంటీగా వస్తుందని నిష్ణాతులు పేర్కొంటున్నారు.

ఉచితంగా శిక్షణ



క్రికెట్‌పై ఆసక్తి ఉన్న వారికి ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. ఎంతో మంది క్రీడాకారులు అనంతపురంలోని ఆర్డీటీలో శిక్షణ తీసుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారు. రంజీ స్థాయిలోనూ రాణిస్తున్నారు. ఆర్డీటీలో ఉన్న అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. క్రికెట్‌లో రాణించి ఉన్నత స్థాయిలో రాణించాలనుకునే వారికి చేయూతనిస్తాం.

– ప్రవీణ్, క్రికెట్ కోచ్, అనంతపురం

విదేశీ క్లబ్‌ల్లోనూ అవకాశం



అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ శిక్షణ ఇస్తున్నాం. ఉదయం ఫిట్‌నెస్‌పై శిక్షణ ఉంటుంది. జూనియర్స్ అండ్ ఉమెన్‌కి ఆర్.కుమార్, అండర్-16, అండర్-19కు నరేష్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. సీనియర్స్ విభాగానికి నేనే శిక్షణ ఇస్తుంటా. ఇక్కడ శిక్షణ తీసుకున్న చాలా మంది క్రీడాకారులు రాష్ట్ర జట్టులో ప్రాతినిధ్యం వహించారు. ఇండియా, న్యూజిలాండ్, దుబాయ్, యూఎస్, శ్రీలంక క్లబ్బుల్లోనూ చాలా మందికి అవకాశం దక్కింది. న్యూజిలాండ్ క్లబ్బులో ఆడిన రచిన్‌రవీంద్ర ఇక్కడి శిక్షణ తీసుకున్నవారే.

– యుగంధర్, ఏసీఏ కోచ్, అనంతపురం

నాన్న మృతిని తాళలేక యువకుడి ఆత్మహత్య

అనంతపురం: నాన్న మృతిని తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... నగరంలోని బుడ్డప్ప నగర్‌లో నివాసముంటున్న పావగడ సంతోష్ కుమార్(21) ఇంటి ఎదుట ఆదివారం ఓ కుక్క గట్టిగా అరుస్తుండడంతో స్థానికులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. ఉరికి విగతజీవిగా వేలాడుతున్న సంతోష్‌కుమార్ మృతదేహాన్ని చూసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని సర్వజనాస్పత్రికి తరలించారు. రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. కాగా, సంతోష్‌కుమార్ నాన్న నాగేంద్ర ప్రసాద్ పది నెలల క్రితం మృతిచెందారు. నాన్న మృతిని తట్టుకోలేక డిప్రెషన్‌లోకి వెళ్లిన సంతోష్‌కుమార్ చివరకు ఆత్మహత్య చేసుకుని ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రెండుకు చేరిన ప్రమాద మృతుల సంఖ్య



జోగి లక్ష్మీనారాయణ (ఫైల్)

రాప్తాడు: నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి... పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఈ నెల 10న రాప్తాడు పోలీస్ స్టేషన్ వెనుక 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదం తెలిసిందే. కారు ఢీకొన్న ఘటనలో అదే రోజు తలారి పోతులయ్య దుర్మరణం పాలయ్యాడు. తీవ్రంగా గాయపడిన అయ్యవారిపల్లికి చెందిన చెందిన జోగి లక్ష్మీనారాయణ (40)ను తొలుత అనంతపురంలోని సర్వజనాస్పత్రికి, ఆ తర్వాత ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 5 గంటలకు ఆయన మృతి చెందాడు. కాగా, లక్ష్మీనారాయణ పాలచెర్ల గ్రామానికి చెందిన లక్ష్మిని వివాహం చేసుకుని పాలచెర్లలోనే ఉంటూ సెంట్రింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై సీఐ టీవీ శ్రీహర్ష దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



మృతుడు ఎర్రిస్వామి

డి హీరేహాళ్ (రాయదుర్గం): విద్యుత్ షాక్‌కు గురై ఓ బాలుడు మృతి చెందాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు.. మండల కేంద్రం డి హీరేహాళ్‌లో నివాసముంటున్న కురుబ నాగరాజు, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో రెండో సంతానం ఎర్రిస్వామి (16) గొర్రెల కాపరి. రోజులాగే పండుగ పూట గొర్రెలు మేపేందుకు గ్రామానికి చెందిన హొసకోట దుర్గప్పతో కలసి అటవీ ప్రాంతానికి ఎర్రిస్వామి కూడా ప్రయాణమయ్యాడు. గ్రామ శివారులోకి చేరుకోగానే ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు వెళ్లిన గొర్రెలను అదిలించేందుకు వెళ్లిన ఎర్రిస్వామి పొరపాటున ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన స్టే వైర్‌ను తాకడంతో షాక్‌కు గురై కుప్పకూలాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని బంధువుల సాయంతో వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

- పండుగ సందర్భంగా కవ్వింపు చర్యలు
- ఫిర్యాదు చేయబోయిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి
- విచారణ పేరుతో సానుభూతిపరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కేసు నమోదు చేస్తే కుమారుడి భవిష్యత్తు నాశనమవుతుందని తండ్రి ఆత్మహత్యాయత్నం

శెట్టూరు: మండలంలోని కైరేవు గ్రామంలో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. దసరా పండుగ సందర్భంగా కవ్వింపుచర్యలకు దిగి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి చేయడమే కాక, పోలీసులకు ఫిర్యాదు చేసి ఇబ్బంది పెట్టారు. ఈ క్రమంలో విచారణ పేరుతో పలువురు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేస్తే విద్యావంతుడైన తన కుమారుడి భవిష్యత్తు నాశనమవుతుందనే ఆందోళనతో పీఎస్ ఎదుటనే ఓ తండ్రి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు...

సైలెన్సర్లు తొలగించి... కవ్వించి

దసరా పండుగ సందర్భంగా శనివారం కైరేవు గ్రామస్తులు తమ వాహనాలను అలంకరించి వీధుల్లో సందడి చేశారు. ఇదే అదనుగా భావించిన టీడీపీ నాయకుడు ఈశ్వరయ్య తన ఇంటి ఎదురుగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ట్రాక్టర్లను మాత్రమే అడ్డుకుని వాగ్వాదానికి దిగాడు. అన్ని వాహనాలు అదే మార్గంలో వెళుతుండగా కేవలం తమ వాహనాలకు మాత్రమే అభ్యంతరం చెప్పడం సబబు కాదని వాహనదారులు అనడంతో మరింత రెచ్చిపోయాడు. అదే సమయంలో ఈశ్వరయ్య కుమారుడు హేమంత్... తన ట్రాక్టర్ సైలెన్సర్ తొలగించి భారీ శబ్దంతో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు ఇళ్ల ముందు చక్కర్లు కొడుతూ కవ్వింపు చర్యలకు దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సకాలంలో అక్కడకు చేరుకుని సర్దిచెప్పి వెళ్లారు. ఘటనపై సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను టీడీపీ నాయకులు అడ్డుకుని బొలెరో వాహనాన్ని ధ్వంసం చేసి, దాడికి తెగబడ్డారు. ఘటనలో ఇరువర్గాలకు చెందిన పలువురు గాయపడ్డారు. అనంతరం టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు రఘు, చరణ్, వర్ధన్, అంజి, గోవిందు, హనుమంతురాయుడు, వన్నప్ప, ఈరన్న, అంజనమూర్తి తదితర 15 మందిని ఆదివారం ఉదయం ఎస్ఐ రాంభూపాల్ అదుపులోకి తీసుకున్నారు.

తండ్రి ఆత్మహత్యాయత్నం..

కైరేవులో శనివారం రాత్రి చోటు చేసుకున్న ఘర్షణకు సంబంధించి ఇరువర్గాల యువకులు, వారి తల్లిదండ్రులను ఆదివారం ఉదయం పోలీస్ స్టేషన్ వద్దకు ఎస్ఐ రాంభూపాల్ రప్పించుకున్నారు. ఘర్షణకు గల కారణాలపై ఆరా తీశారు. ఈలోపు పోలీసులు అన్యాయంగా తన కుమారుడిపై కేసు నమోదు చేస్తే విద్యావంతుడైన అతని భవిష్యత్తు నాశనమవుతుందనే ఆందోళనతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన అంజి తండ్రి పాతలింగ పోలీస్ స్టేషన్ ఎదుట క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన పోలీసులు, స్థానికులు వెంటనే పాతలింగను కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి అంబులెన్స్‌లో తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు అనంతపురానికి రెఫర్ చేశారు. దీనిపై ఎస్ఐ రాంభూపాల్ మాట్లాడుతూ... ఎవరిపై కేసులు నమోదు చేయలేదని పేర్కొన్నారు. గొడవకు కారణాలు ఏమిటనే అంశంపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కొడవలితో దాడికి యత్నం



విట్లంపల్లిలో కొడవలి చేతపట్టుకుని దాడికి సిద్ధమవుతున్న టీడీపీ కార్యకర్తలు

కళ్యాణదుర్గం: మండలంలోని విట్లంపల్లిలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రుద్రప్ప, వన్నూరుస్వామి, దొణస్వామిపై టీడీపీకి చెందిన మెట్టు గోవిందు కుమారులు కొడవలితో దాడి చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. అదే సమయంలో మహిళలు అక్కడకు చేరుకుని కొడవలిని లాక్కొన్నారు. రోజూ ఏదో ఒక సాకుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కవ్వింపు చర్యలకు దిగుతూ గ్రామంలో భయాందోళనలు సృష్టిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. టీడీపీ కార్యకర్తల దౌర్జన్యాలపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తెలిపారు.

కణేకల్లు చెరువులో కిషోర్ మృతదేహం లభ్యం



కిషోర్ (ఫైల్)

కణేకల్లు: మండలంలోని యర్రగుంట శివారులో ఈ నెల 10న హెచ్చెల్సీలో ప్రమాదవశాత్తు కాలు జారి పడిన బి.కిషోర్‌కుమార్ (44) ఆదివారం కణేకల్లు చెరువులో మృతదేహమై తేలాడు. గురువారం సాయంకాలం పీరాషావలి దర్గాకెళ్లిన కిషోర్ హెచ్చెల్సీలో గల్లంతైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కణేకల్లు చెరువులో అతని మృతదేహం లభించింది. హెచ్చెల్సీలో కాళ్లుచేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు జారి పడినట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఇద్దరు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా... ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ... పండుగపూట పిల్లలకు కొత్త దుస్తులు కొనివ్వలేక పోతున్నానంటూ మనోవేదనకు లోనై ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు...



రాబీ (ఫైల్)



మృతుడు నగేష్



మృతురాలు హేమలత

- **గుంతకల్లు రూరల్:** స్థానిక దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న రాబీ (29) ఆత్మహత్య చేసుకుంది. రాబీ భర్త మహమ్మద్ (ఇరానీ) కొంత కాలంగా కర్ణాటకలోని కోలారు జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు పిల్లలతో ఒంటరిగా జీవితాన్ని నెట్టుకొస్తున్న రాబీ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ వస్తోంది. అప్పడప్పుడు తల్లి ఇచ్చే కొంత డబ్బుతో పిల్లల ఆకలి తీరుస్తూ వస్తోంది. ఈ క్రమంలో శనివారం డబ్బు సర్దుబాటు కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాబీ ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం గుర్తించిన ఇరుగు పొరుగు వారు ఉరికి వేలాడుతున్న రాబీని కిందకు దించి గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.
- **శెట్టూరు:** ఒంటరి జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండల కేంద్రం శెట్టూరుకు చెందిన బోయ నగేష్ (30) భార్య మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి లోలోన మదనపడుతూ మద్యానికి బానిసైన నగేష్... శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటి పైకప్పు దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వన్నూరుస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.
- **కంబదూరు:** మండలంలోని చెర్లోపల్లికి చెందిన వివాహిత హేమలత (26) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... హేమలత భర్త శ్రీనివాసులు, కుమార్తె మానసి ఇద్దరూ కొన్ని రోజులుగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఇద్దరికీ పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా జబ్బు నయం కాలేదు. దీనికి తోడు చికిత్సకు చేసిన అప్పులు రూ.లక్షకు పైగా చేరుకున్నాయి. ఈ క్రమంలో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. దసరా పండుగకు పిల్లలకు కొత్త దుస్తులు కొన్విలేక పోతున్నానంటూ మదనపడుతూ మానసికంగా కుదేలైన హేమలత... శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై ఏఎస్ఐ రవిప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మాపై నిందలు వేయడం తగదు జేసీ

- టీడీపీ నేత రాజేంద్ర నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

అనంతపురం టవర్‌క్లాక్: కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారంటనే తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డికి గిట్టదని టీడీపీ నేతలు యల్లనూరు రాజేంద్రనాయుడు, ధనుంజయ, బాలరంగయ్య మండిపడ్డారు. అనవసరంగా తమపై నిందలు వేయడం మానుకోవాలంటూ జేసీకి హితవు పలికారు. ఆదివారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజేంద్ర నాయుడు మాట్లాడుతూ... 1994, డిసెంబర్ 24న తన తండ్రిని జేసీ ప్రభాకర రెడ్డి ఇంటి సమీపంలోనే హతమార్చారని, ఈ కేసులో నిందితులకు అప్పట్లో ఆశ్రయం ఇచ్చింది జేసీ కుటుంబసభ్యులేనని గుర్తు చేశారు. అలాగే తన అన్నను చంపిన వారికి జీపును సమకూర్చింది కూడా జేసీ ప్రభాకరరెడ్డినే అని అన్నారు. ఈ వాస్తవాలను కాదనే దమ్ము జేసీ ప్రభాకరరెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటి వరకూ తమ కుటుంబంపై అక్రమంగా 18 కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నా మౌనంగానే అన్నింటినీ భరిస్తూ వచ్చామన్నారు. తాడిపత్రిలో కమ్మ కులానికి చెందిన వారిని లక్ష్యంగా చేసుకుని నిందలు వేయడం సరికాదన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేశామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం సొంత డబ్బు ఖర్చు పెడుతూ వచ్చామన్నారు. సారాయి అంగళ్ల నుంచి దందా చేయాల్సిన దౌర్భాగ్యం తమకు పట్టలేదన్నారు. ఇప్పటికైనా జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరు మార్చుకుని తమపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

తండ్రిని హత్య చేసిన తనయుడు



హతుడు ఆవుల రవీంద్రారెడ్డి

అనంతపురం: మద్యం మత్తులో కుటుంబ సభ్యులను వేధించడమే కాక... కుమార్తె పెళ్లి సంబంధాలనూ చెడగొడుతున్న తండ్రిని కుమారుడు హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని జనశక్తి నగర్‌లో నివాసముంటున్న ఆవుల రవీంద్రారెడ్డి (54) పేకాట, మద్యానికి బానిసై జులాయిగా మారాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఇంటికి చేరుకుని భార్యాపిల్లలను వేధించేవాడు. కుటుంబసభ్యులు ఎంత వారించినా ఆయనలో మార్పు రాలేదు. పైగా తన జల్సాలకు డబ్బు ఇవ్వలేదన్న అక్కసుతో కుమార్తెకు కుదిరిన పెళ్లి సంబంధాలను సైతం చెడగొడుతూ వచ్చేవాడు. శనివారం సాయంత్రం రవీంద్రారెడ్డి మద్యం మత్తులో ఇంటికి చేరుకుని భార్య శ్రీదేవితో గొడవపడ్డాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కుమారుడు వేణుగోపాల కృష్ణారెడ్డి అడ్డుకోబోవడంతో ఘర్షణను మరింత పెద్దది చేశాడు. ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన కుమారుడు రోకలితో తండ్రి తలపై దాడి చేయడంతో బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబసభ్యులు రవీంద్రారెడ్డిని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు నాల్గో పట్టణ సీఐ సాయినాథ్ వెల్లడించారు.

క్లుప్తంగా

పంపనూరులో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మూల విరాట్‌కు ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయంలో రాహుకేతు కాలసర్పదోష నివారణ హోమాలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామికి, పార్వతీ దేవికి ప్రత్యేకంగా పూజలు చేసి మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు హుండీ లెక్కింపు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బాబు ఆదివారం ఓ ప్రకనటలో తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనాలనుకున్న భక్తులు ఆలయ నిబంధనల మేరకు సంప్రదాయ దుస్తుల్లో రావాలని సూచించారు.

నేడు పరిష్కార వేదిక

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరగనుంది. కమిషనర్ నాగరాజు ఆదేశాలతో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అధికారులు అందుబాటులో ఉంటారు.

భక్తిశ్రద్ధలతో బాబా మహాసమాధి వేడుకలు


పూజలందుకున్న షిర్డీ సాయినాథుడు

అనంతపురం కల్చరల్: విజయదశమి పర్వదినం సందర్భంగా నగరంలోని పలు బాబా మందిరాలలో శ్రీషిర్డీ సాయి మహాసమాధి వేడుకలు ఘనంగా జరిగాయి. బాబా మహాసమాధి పొంది 106 ఏళ్లయిన సందర్భంగా 106 దీపాలు వెలిగించి ప్రత్యేక అలంకార సేవలు నిర్వహించారు. కాగడా హారతులు ఇచ్చారు. భక్తిగీతాలతో, సాయి నామస్మరణతో మందిరాలు మార్మోగాయి.స్థానిక వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న శ్రీషిర్డీ సాయి బాబా మందిరంలో విశేష అలంకార సేవలు, ప్రసాద వితరణ చేపట్టారు. మూడోరోడ్డు, పాతూరు చెరువుకట్ట, రామచంద్రనగర్, వేణుగోపాలనగర్, తపోవనం శ్రీశివశక్తిబాబా మందిరం తదితర చోట్ల మహా సమాధి వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

మన్నీలలో పౌరాణిక నాటక ప్రదర్శన


పౌరాణిక నాటికలోని ఓ దృశ్యం

రాప్తాడురూరల్: దసరా నవరాత్రుల సందర్భంగా మన్నీల గ్రామంలో ఆదివారం శ్రావణ స్వర్ణ నాట్యమండలి ఆధ్వర్యంలో'సప్తమాంకములు' పౌరాణిక నాటికను ప్రదర్శించారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు నాటక ప్రదర్శన సాగింది. చింతామణి నాటకంలో బిల్వ మంగళ సీను, భవానీ సీను, బాలనాగమ్మ నాటకంలో మరాఠి సీను, శ్రీ రామాంజనేయయుద్ధం, శ్రీ సత్యహరిశ్చంద్రలో భవాని సీనును కళాకారులు ప్రదర్శించారు. నాటకాలను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.

సీమ కవిత్వానికి సజీవ దర్పణాలు


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: రాయలసీమ కవిత్వానికి సజీవ దర్పణాలుగా నిలిచే పుస్తకాలను ఆవిష్కరించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. కవిసమ్మేళనం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ప్రముఖ కవి వెంకటకృష్ణ రచించిన 'రవ్వలసడి', శ్రీనివాస గౌడ్ రచించిన 'శ్రీనివాసం' పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. సభకు డాక్టర్ అంకె శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతి నారాయణ, విమర్శకులు డాక్టర్ నాగేశ్వరాచారి, అనువాదకులు జీవీరత్నాకర్, సీనియర్ కవులు తరిమెల అమరనాథరెడ్డి, నబీరసూల్, జిరసం అధ్యక్షుడు డాక్టర్ జెన్నె ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, రాజారాం తదితరులు హాజరై.. పుస్తకాలలోని విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జిల్లాలోని పలువురు రచయితలను, కవులను సత్కరించారు.


పంపనూరులో అలంకరణలో పార్వతి దేవి


ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత


బాలయోగి ఆశ్రమంలో అలంకార సేవల్లో అమ్మవారు


ఆత్మకూరులో దుర్గాదేవి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


కొత్తూరు అమ్మవారిశాలలో శయనోత్సవంలో పాల్గొన్న జిల్లా జడ్జి శ్రీనివాస్, సతీమణి శ్రీవల్లి, ఆలయ కమిటీ సభ్యులు


దుర్గాదేవి విగ్రహాన్ని కాలువలో నిమజ్జనం చేస్తున్న భక్తులు


శ్రీవారి బ్రహ్మరథోత్సవం

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక భావాన్ని పంచుతూ సాగిన దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం నయనానందకరంగా ముగిశాయి. నవవిధ రూపాలలో దర్శనమిచ్చిన అమ్మవారు విజయకనకదుర్గగా, అన్నపూర్ణేశ్వరిగా సర్వాలంకారంలో భక్తులకు నేత్రపర్వం చేశారు. మొదటిరోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయంలో ఈఓ రమేష్‌బాబు ఆధ్వర్యంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి పూజలు జరిపించారు. బ్రహ్మకుమారీలు సిస్టర్ శారద నేతృత్వంలో నవదుర్గల అలంకరణ, నగరోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సర్వాంగ సుందరంగా అలంకరించిన అమ్మవారి ప్రతిరూపాలను దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులతో ఆలయాలు రద్దీగా మారాయి. అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి.

- స్థానిక హెచ్చెల్సీ కాలనీ శ్రీనసనకోట ముత్యాలమ్మ, రెండో రోడ్డు శ్రీ జ్ఞానం పీఠం, శ్రీశివబాలయోగి ఆశ్రమం, శివకోటి, శారదాశంకరమఠం, కల్యాణదుర్గం శ్రీమైసూరు నగిరమ్మ ఆలయం, తపోవనం శ్రీవేదమాత గాయత్రి దేవాలయం, ఐదోరోడ్డు సుంకలమ్మ, పెద్దమ్మవార్ల ఆలయాలలో భక్తజనజాతరతో పండుగ వాతావరణం వెల్లివిరిసింది.
- పది రోజులుగా కనులపండువగా సాగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం సంప్రదాయసిద్ధంగా సాగిన చక్రస్నానంతో ఘనంగా ముగిశాయి. స్థానిక ఆర్‌ఎఫ్‌రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజావరోహణం, చక్రస్నానం, వసంతోత్సవం, శయనోత్సవ వేడుకలు నిర్వహించారు. విజయదశమి సందర్భంగా నిర్వహించిన శ్రీవారి బ్రహ్మరథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులతో పాటు ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, కొండన్న, గుప్తా, నాగరాజు,రామారావు, అర్చకులు హరికిషోర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. హౌసింగుబోర్డులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన హోమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. రామ్‌నగర్, శ్రీనివాసనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలలో బ్రహ్మోత్సవ ముగింపు వేడుకలు కమనీయంగా సాగాయి.

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనం

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి, చిన్మయనగర్, ఇందిరమ్మ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలను ప్రజలు శనివారం భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజులు పాటు దుర్గాదేవికి విశేష పూజలు నిర్వహించి మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన వెండి రథం, ట్రాక్టర్లలో కొలువుదీర్చి ఊరేగించారు. రథం ముందు పిల్లలు, వృద్ధులు, మహిళలు, పెద్దలు తారతమ్యం లేకుండా నృత్యాలు చేశారు. చిన్మయనగర్‌లో శ్రీగౌరి ప్రసన్నేశ్వస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని వెండి రథంపై ఊరేగించగా, రథం ముందు మహిళలు ఒకే రకం చీర ధరించి కోలటా ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. గౌరీదేవిని భక్తిశ్రద్ధలతో పండమేరు వంకలో నిమజ్జనం చేశారు. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాప్తాడు సీఐ టీవీ.శ్రీహర్ష ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా దసరా సందడి కనిపించింది. ఆత్మకూరులోని వాసవీ మాత ఆలయంలో దుర్గాదేవి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి కాలువ నీటిలో నిమజ్జనం చేశారు. ఆత్మకూరులోని అంకాలమ్మ దేవికి, పంపనూరులో పార్వతి దేవికి, వడ్డుపల్లిలో సుంకు లమ్మకు, సనపలో రేణుకా యల్లమ్మకు, యాలేరులో యల్లమ్మ దేవికి ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేశారు. సాయంత్రం జమ్మి ఆకును పెద్దలకు ఇచ్చి కాళ్లకు ఆశీర్వాదాలు తీసుకున్నారు.


రాప్తాడు: ట్రాక్టర్‌పై ఊరేగుతున్న ఇందిరమ్మ కాలనీ దుర్గాదేవి



రాప్తాడు: వెండి రథంపై ఊరేగుతున్న శివాలయం దుర్గాదేవి


రాప్తాడు: దుర్గాదేవి వెండి రథం ముందు కోలాటం ఆడుతున్న మహిళలు


జనసందోహం మధ్య నిమజ్జనానికి వెళుతున్న దుర్గాదేవి

ఘనంగా ఐదుకల్లు సదాశివన్ వర్ధంతి


సదాశివన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

రాప్తాడురూరల్: కమ్యూనిస్ట్ నాయకుడు దివంగత ఐదుకల్లు సదాశివన్ 36వ వర్ధంతిని సీపీఐ అనంతపురం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రూరల్ మండలం సమతాగ్రామంలో సీపీఐ రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.జగదీష్, ప్రముఖ న్యాయవాది ఐదుకల్లు రవీంద్రనాథ్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సదాశివన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ఐదుకల్లు సదాశివన్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా స్కూలు విద్య వరకు మాత్రమే చదివారన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై బాల్యంలోనే హరిజనోద్ధరణకు అహర్నిశలు శ్రమించిన మహోన్నతుడని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొని, బ్రిటిష్ పోలీసుల పైశాచిక చర్యలపై పోరాటం చేశారన్నారు. సొంతంగా హాస్టల్ ఏర్పాటు చేసి పేద వర్గాల విద్యార్థులకు అన్నం పెట్టిన మహోన్నత వ్యక్తి అన్నారు. సదాశివన్ స్థాపించిన హాస్టల్‌లో చదువుకున్న వ్యక్తుల్లో మన రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కూడా ఒకరన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, మల్లికార్జున, పద్మావతి, రాజేష్ గౌడ్, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగ జయప్రదం చేయాలి

రాప్తాడు: మండలంలో ఈ నెల 14 నుంచి 19 వరకు నిర్వహించే 'పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు'ను జయప్రదం చేయాలని ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో 'పల్లెపండుగ - పంచాయతీ వారోత్సవాలు' గ్రామాల్లో చేపట్టి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిద్దామన్నారు. ఈ నెల 14న ఎం.బండమీదపల్లి, హంపాపురం, 15న రాప్తాడు, గాండ్లపర్తి, 16న యర్రగుంట, బోమ్మెపర్తి, జి.కొత్తపల్లి, 17న పుల్లలరేవు, మరూరు, 18న ఎం.చెర్లోపల్లి, భోగినేపల్లి, ప్రసన్నాయపల్లి, బుక్కచెర్ల, 19న గొల్లపల్లి, పాలచెర్ల, గొందిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

పంటకోతను వాయిదా వేసుకోండి

చెన్నేకొత్తపల్లి: రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వేరుశనగ పంట కోతను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు అల్పపీడనం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిందన్నారు. ఈ మూడు రోజుల పాటు వాయిదా వేసుకొని పంటను కాపాడుకోవాలని రైతులకు సూచించారు.

16న అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

రాప్తాడు: ఐసీడీఎస్ అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న ఒక మినీ అంగన్‌వాడీ వర్కర్, 9 ఆయా పోస్టుల భర్తీకి ఈ నెల 16న అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ ధనలక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని టీవీ టవర్స్ కాలనీ మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, పీసీ కాలనీ, కందుకూరు-3, ఎంబీ పల్లి, బిందెలకాలనీ, ఆత్మకూరు మండలం ముట్టాల, కుర్లపల్లి, రాప్తాడు మండలం బొమ్మేపర్తి, రాప్తాడు-3, మరూరు-3 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 16న ఉదయం 10 గంటలకు అనంతపురంలోని ఆర్డీఓ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లు తప్పకుండా తీసుకురావాలని తెలిపారు.

రేపు గుండె, కంటి వైద్యశిబిరం

అనంతపురం సెంట్రల్: ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నగరశాఖ, కిమ్స్ సవేరా ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15న స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ నాయకులు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డీఎకో పరీక్షలు ఉచితంగా చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెడ్డి వివాహ పరిచయ వేదికకు స్పందన

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'రెడ్డి వివాహ పరిచయ వేదిక'కు మంచి స్పందన లభించింది. అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు పాపంపేటలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అమ్మాయిలు, అబ్బాయిల తల్లిదండ్రులు హాజరయ్యారు. ప్రతినెలా రెండో ఆదివారం ఉచితంగా వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామని రాయలసీమ రెడ్డి జన సంఘం వ్యవస్థాపకులు రొద్దం సురేష్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, కార్యదర్శి దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ రామకృష్ణారెడ్డి, రమణారెడ్డి, పోతిరెడ్డి, కల్లూరు నాగరత్నం రెడ్డి పాల్గొన్నారు.

'విశ్వవిద్యాలయంలో మద్యం టెండర్లా?'

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంతో ఉన్నతమైన అనంతపురం జేఎన్‌టీయూలో మద్యం టెండర్లు నిర్వహించడం విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలను దిగజార్చడమేనని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యానిలయాన్ని ఇలా ఉపయోగించుకోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో యువతను పక్కదోవ పట్టించేలా మాదక ద్రవ్యాలు, మద్యం, హత్యా రాజకీయాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ స్థలాల్లో మద్యం టెండర్లు నిర్వహించడం వల్ల విద్యార్థుల ఆలోచన తీరు పక్కదారి పట్టే ప్రమాదముందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ తీరును మార్చుకోవాలని సూచించారు. విద్యాలయాలకు సమీపంలో మద్యం షాపులు అనుమతించే ఆలోచన ఉంటే వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

సంతల ఆదాయం రూ.3.45 లక్షలు

అనంతపురం సెంట్రల్: వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన సంతల ద్వారా రూ.3.45 లక్షల ఆదాయం వచ్చినట్లు కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2.15 లక్షలు, ఆదివారం పశువుల సంత ద్వారా రూ. 1.30 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.



తగలబడుతున్న డంపింగ్ యార్డు

అనంతపురం గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డుకు ఆదివారం రాత్రి మంటలు అంటుకున్నాయి. అదే సమయంలో గాలులు వీయడంతో ఎగిసిపడ్డాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళన చెందారు. అక్కడి నుంచి వచ్చిన వ్యర్థాల వాసనతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

